క్లుప్తంగా

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



గుంటూరు ఎడ్యుకేషన్: దాతలు అందిస్తున్న చేయూతకు తోడు స్వయం ప్రతిభతో విద్యార్థినులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం 12 మంది పేద, ప్రతిభావంతులైన విద్యార్థినులకు రూ.1.65 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా బొమ్మిడాల ఫౌండేషన్ ద్వారా శ్రీకృష్ణమూర్తి అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపకార వేతన కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ కుటుంబరావు, డాక్టర్ పి.విజయలక్ష్మి, ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలి



నగరంపాలెం: భావితరాలకు సహజ వనరులు అందించాలంటే ఇంధన పొదుపు పాటించాలని విద్యుత్ శాఖ టౌన్-1 డివిజన్ ఈఈ శ్రీనివాసబాబు అన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్ ఇతరత్రా అంశాలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ విలువైనదని వృథా కాకుండా కాపాడుకుందామని చెప్పారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యుత్ పొదుపు ఆచరించాలని అన్నారు. కార్యక్రమంలో టౌన్-4 డీఈఈ పీహెచ్ ఖాన్, సీఆర్‌డీఏ కన్‌స్ట్రక్షన్ డీఈఈ జి.సురేష్‌బాబు, డీ-3 ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

ఎమ్మెల్యే ముస్తఫా



పట్నంబజారు: నియోజకవర్గంలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించటంలో ముందంజలో ఉండాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా సూచించారు. 55వ డివిజన్ బొంగరాలబీడులో మంగళవారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ క్రిస్మస్ నేపథ్యంలో చర్చిల ఉన్న ప్రాంతాల్లో పరిశుభ్రత వాతావరణం పాటించాలని స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ పి.అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నేతలు షంషేర్, దాస్, సలాం, మార్కెట్‌శ్రీను, కోట రాందాస్, వినోద్ పాల్గొన్నారు.

హనుమాన్ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ

పాత గుంటూరు: జనవరి 12న విడుదల కానున్న హనుమాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం సినిమా ట్రైలర్‌ను కొత్తపేటలోని భాస్కర్ థియేటర్‌లో ఆవిష్కరించారు. యూవీ ప్రొడక్షన్ డిస్ట్రిబ్యూటర్ శంకర్ మాట్లాడుతూ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఇంద్ర సినిమాలో బాల నటుడిగా నటించిన తేజ సజ్జ హీరోగా నటించిన సినిమాను కుటుంబసమేతంగా చూడాలని ప్రేక్షకులను కోరారు.

విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి కృషి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాస వన సమారాధన గుంటూరు అరండల్ పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటురు మహానగర వన సమారాధన కమిటీ సభ్యులు గట్టి శ్రీనివాసు, పదిర ఈశ్వరచారి, భరద్వాజ, భద్రయ్య, శివరామబ్రహ్మం, కొటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రతి కుటుంబానికీ భరోసా

- ఎంపీపీ రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ
- ఆరోగ్యశ్రీ బ్రోచర్‌లు విడుదల



ఆరోగ్యశ్రీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ

తాడేపల్లిరూరల్: ప్రతి పేద కుటుంబానికీ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యానికి భరోసా ఇస్తూ మరోసారి తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల కార్యాలయంలో ఆరోగ్యశ్రీ బ్రోచర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.25 లక్షల వరకు వైద్యం చేయించుకునేలా పథకాన్ని ప్రవేశపెట్టారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి విద్య, వైద్యంపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రులను, పాఠశాలలను నాడు-నేడు కింద అభివృద్ధి చేశారని, గతంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే పేదలు భయపడేవారని, ఇప్పుడు చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళుతున్నారని, పేదలకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా భరోసా కల్పిస్తూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడానికి రూ.25 లక్షలు ప్రకటించం చాలా ఆనందించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచులు కొండూరు సుధారాణి, ఉన్నం ఝాన్సీ, అజీజున్, ప్రభుత్వ వైద్యులు అబ్దుల్ రహమాన్, ఇందిర, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ షేక్ షహేలానర్గీస్

పేదల పాలిట ఆరోగ్యశ్రీ వరం

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ఎంపీపీ షేక్.షహేలానర్గీస్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పేదల పాలిట ఆరోగ్యశ్రీ వరం వంటిదని చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్యం చేయించడం ద్వారా మెరుగైన ఫలితాలు పేదలు పొందుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వలంటీర్లు ప్రతి ఒక్కరికి బ్రోచర్లు పంపిణీ చేసి వారిచే ఆరోగ్యశ్రీ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయిస్తారని చెప్పారు. అనంతరం ఆరోగ్యశ్రీ బ్రోచర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విలియమ్స్, వైద్యులు ఫరీనాబేగం, ఎస్తేరురాణి, తహసీల్దార్ పద్మనాభుడు, సలీం, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, హెచ్‌ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పెదపాలెంలో నిర్వహించిన యాత్రలో పాల్గొన్న వైద్యులు, వివిధ శాఖ అధికారులు

తాడేపల్లిరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను మంగళవారం దుగ్గిరాల మండలం పెదపాలెం, వీర్లపాలెం గ్రామాల్లో నిర్వహించారు. పెదపాలెం గ్రామంలో నిర్వహించిన ఈ యాత్రకు సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు పుతుంబాక సత్యసాయి కృష్ణలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రధానమంత్రి మాతృత్వ యోజన కార్యక్రమం ఉపయోగాలను, ఆయుష్మాన్ భారత్ కార్డు ఉపయోగాలను ప్రజలు వివరించారు. అనంతరం ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి గ్యాస్ సిలెండర్, రెగ్యులేటర్, పత్రాలను అందజేశారు. మండల వ్యవసాయ అధికారి డ్రోన్ ద్వారా క్రిమిసంహార మందులు ఏవిధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ వారిచే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. వీర్లపాలెంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ బి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా, ఏపీఎం మహాలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు స్వయం సహాయ సంఘాల వారికి ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. ఆయుష్మాన్ కార్డును ఎలా పొందాలో వివరించారు. ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకం ద్వారా లబ్ధి పొందిన వారితో వారి అనుభవాలను అందరికీ వివరించారు. ఆయుష్మాన్ కార్డు ప్రయోజనాలను వివరించారు. అనంతరం బాలికలతో నృత్యాలు, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీష, మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వైద్యులు డాక్టర్ హాసిని, క్షయ వ్యాధి నివారణ సూపర్‌వైజర్ రవి, రెండు గ్రామాల డ్వాక్రా యానిమేటర్లు, విలేజ్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్లు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

మేయర్‌తో పోసాని కృష్ణ మురళి



నెహ్రూనగర్: కార్పొరేషన్ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి మంగళవారం భేటీ అయ్యారు. సంపత్ నగర్ లోని మేయర్ క్యాంపు కార్యాలయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 23వ తేదీ నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న నంది నాటకోత్సవ ప్రారంభ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు.

విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదవాలి



తెనాలిటౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టంగా కష్టపడి చదవాలని బీఎస్ఎన్ఎల్ డివిజనల్ మేనేజర్ గిరిబాబు పేర్కొన్నారు. పట్టణంలోని మారీసుపేట చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 1979-80 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థి టి.ఎస్.ఎస్.ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన సభకు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బషీర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. సబ్ డివిజనల్ మేనేజర్ మదన్ మోహనరావు, పూర్వవిద్యార్థి ప్రసాద్, ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు వాటర్ బాటిల్స్, లంచ్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది పాఠశాలలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థులు మహ్మద్ షరీఫ్, రమణబాబు, శ్రీనివాసరెడ్డి, పోలేరమ్మ, నూర్జహాన్, హనుమంతరావు, శ్రీదేవి, భూలక్ష్మి పాల్గొన్నారు.

26 నాటికి పెండింగ్ అర్జీలు పూర్తి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో పెండింగ్ అర్జీలు ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేస్తామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల తుది జాబితా వచ్చే నెల 5న వస్తుందని, ఇప్పటి వరకు డ్రాఫ్ట్ రోల్‌పై అందిన ఫిర్యాదులు, అర్జీలను ఈ నెల 26 నాటికీ పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్న బీఎల్‌ఓల వారిగా సమీక్షించి ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేసేలా చూడాలని సూపర్వైజరీ అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓ బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్ వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నుంచి జానీ బాషా, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, సీపీఎం నుంచి షేక్ ఖాసిం పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో స్పోర్ట్స్ డే



తెనాలిఅర్బన్: జగ్గడిగుంట పాలెంలోని కేంద్రియ విద్యాలయంలో మంగళవారం స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తిని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత భవన్ పూర్తయిన తర్వాతనే తెనాలి రోడ్డు విస్తరణ

పనులు పరిశీలించిన ఎమ్మెల్సీ మురుగుడు, ఇన్‌చార్జి చిరంజీవి



చేనేత భవన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, పార్టీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి

మంగళగిరి: నగరంలోని పాతబ బస్టాండ్ ఆవరణలో నిర్మాణం పూర్తి చేసుకున్న డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్యల చేనేత భవన్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేసి చేనేత వస్త్ర వ్యాపారులకు దుకాణాలు కేటాయించిన వెంటనే తెనాలి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవిలు తెలిపారు. మంగళవారం నగరంలోని చేనేత భవనం, డ్రైనేజిల నిర్మాణ పనులు పరిశీలించిన అనంతరం నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్‌తో సమావేశం అయిన ఎమ్మెల్సీ హనుమంతరావు, చిరంజీవిలు నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. నగరంలోని డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేసి సత్వరమే ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఏసీపీ.వెంకటేశ్వర్లు, డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్ ఉదయ తదితరులు

తాడేపల్లిరూరల్: మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని స్వయం కృషి పరస్పర సహకార సంఘం ట్రెజరర్ దాసరి నాగలక్ష్మి అన్నారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళగిరి స్వయంకృషి పరస్పర సహకార సహయ పొదుపు, పరపతి సంఘం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగలక్ష్మి మాట్లాడుతూ గతంలో తమ కోఆపరేటివ్ సంస్థలో కేవలం ఒక్క పాడి పరిశ్రమ ద్వారా జీవనం సాగించే మహిళలకు మాత్రమే సభ్యత్వం పొందే అవకాశం ఉన్నదని, కానీ ఇప్పుడు నిబంధనలను సడలించామని, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి కూడా అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. గ్రామస్థాయిలో ఎంతో మంది మహిళలకు ఈ విషయం తెలియక వడ్డీ వ్యాపారస్తుల వద్ద అధిక వడ్డీలకు డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సుపీరియన్ సిస్టర్ ఉదయ మాట్లాడుతూ తమ సంస్థ మొదటి నుంచి మహిళలు, ఆడ పిల్లల కోసం , వారి అభివృద్ధి కోసం, వారి హక్కుల సాధన కోసం పనిచేస్తోందని, అందులో భాగంగా మహిళలు కూడా వ్యాపార రంగంలో రాణించి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ సంవత్సర కాలంలో సుమారు 65 మంది ఈ కో ఆపరేటివ్ ద్వారా సహాయం అందుకుని వారి వ్యాపారాలు అభివృద్ధి చేసుకున్నారని, నూతనంగా 70 మంది వరకు సభ్యత్వం తీసుకోవడం చాలా శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో అత్తోట పోతురాజు, కె.కార్తీక్, కో ఆపరేటివ్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టకపోతే ఉద్యమిస్తాం



కమ్యూనిటీ హాల్, కృష్ణాలయాన్ని పరిశీలిస్తున్న మిర్చి యార్డ్ చైర్మన్ రాజనారాయణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఇందిరానగర్‌లో నిర్మాణం జరుగుతున్న కృష్ణాలయం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా యాదవులను కలుపుకుని ఉద్యమిస్తామని సంఘ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం ఇందిరానగర్‌లో రాష్ట్ర యాదవ సంఘం నాయకులు, మిర్చి మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ యాదవ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని, కంచే వేసిన కృష్ణాలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యాదవుల కమ్యూనిటీ హాల్, కృష్ణాలయం విషయంలో గొడవ జరగడం దురదృష్టకరమని, పద్మశాలీయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ మునగపాటి వెంకటేశ్వరరావు కోర్టును ఆశ్రయించడం, స్టే తీసుకు వచ్చి కృష్ణాలయ నిర్మాణం ఆపడం సమంజసం కాదని అన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించకపోతే యాదవ సంఘాలను కలుపుకుని రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని, ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), తోట శ్రీనివాసరావు, దొడ్డక కృష్ణ, తోట సాయి, తాడిబోయిన సుబ్బారావు, తాడిబోయిన సురేష్, చిలకా మహేష్, దొడ్డక శ్రీనివాసరావు, యిరికుల సురేష్, రఘు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ మోజెస్, పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మోస్ట్ రెవరెండ్ కేఎఫ్ పరదేశిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థి, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత కమిషనర్ మేకతోటి దయాసాగర్ తన తల్లిదండ్రులు, సోదరుని జ్ఞాపకార్థం అందజేసిన రూ.30 వేలతో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో ప్రభుత్వ మహిళా కళాశాల రూ.20 వేలు, ఏసీ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలు అందుకున్నారు. బెన్నిసన్ స్పాన్సర్ చేసిన రూ.ఐదు వేలను తృతీయ బహుమతి రూపంలో ఏసీ కళాశాల పీజీ విద్యార్థులు గెలుపొందారు. డీఎస్పీ ఐజక్ ప్రభాకర్ స్పాన్సర్ చేసిన రూ.రెండువేల కన్సొలేషన్ బహుమతులను జేకేసీ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రజాసేవలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి సంఘ కార్యదర్శి డాక్టర్ ఎజ్రా విజయ్ శేఖర్, డాక్టర్ మైఖేల్ వినయ తేజ, డాక్టర్ పీబీ శరా, డాక్టర్ దయానా సత్యలత, ప్రభాకర్, రాజశేఖర్, శాంతి ప్రియ రంజని, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేట్ కట్ కేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు



సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి షేక్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ మనుషుల పాపాల కోసం యేసు మరణించాడని, మనిషిగా ఈ భూమి మీదకు వచ్చాడని అన్నారు. యేసు జీవితం మనందరికి ఆదర్శనం అని, ఆయన్ని అనుసరిస్తే మనం సంతోషంగా ఉండవచ్చని సూచించారు. యేసు జననం కేవలం ఒక మతానికి చెందినది కాదు అని అన్నారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సి.ఇందిర, సీహెచ్‌ఓ ఎస్.జానమ్మ, హెచ్‌వి.భాగ్యలలిత, ఖాజా, ఎంఎల్ హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంటకల నిర్మల ఇంగ్లిష్ మీడియం స్కూలులో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. సెమీ క్రిస్మస్ వేడుకలు సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యూనివర్సల్ కళాశాలలో...

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రు సమీపంలో ఉన్న యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ రెవ.ఫాదర్ ఫాతిమా మర్రెడ్డి క్రీస్తు బోధనలు వివరించారు. తమకు వచ్చిన అవకాశాలు వినియోగించుకుని విజయం సాధించాలని సూచించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ రెవ.ఫాదర్ సీహెచ్.కిషోర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఏసు జననం గురించి వివరించారు. మనం ఇతరులకు ఏం ఇస్తున్నామో అవే మనకు తిరిగి వస్తాయన్నారు. క్రిస్మస్ గీతాలు, నృత్యాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరెడ్డి, డిప్లమా ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు